





# కరపత్రం

SINCE 2014

బుధవారం ఆగస్ట్ 27 2025 | సంపుటి :0 | సంచిక :311 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4


## ఎలక్ట్రిక్ వాహనరంగంలోకి మారుతి

- తొలి ఇవి- విటారా ఉత్పత్తి ప్రారంభం
- వంద దేశాలకు ఎగుమతి లక్ష్యంగా ఉత్పత్తులు
- గుజరాత్ హన్సల్‌పూర్ ప్లాంట్‌లో ప్రారంభించిన మోడీ






భారత ప్రభుత్వం ఎలక్ట్రిక్ వాహనాలకు అందిస్తున్న ప్రోత్సాహంతో అనేక కంపెనీలు భారత అవసరాలతో పాటు- విదేశాలకు ఎగుమతి చేసేందుకు ఎలక్ట్రిక్ కార్లు, ఈవీ స్కూటర్లను తయారు చేస్తున్నాయి. ఈ క్రమంలోనే మారుతీ సుజుకీ కంపెనీ తయారు చేసిన తొలి మేడిన్ ఇండియా ఎలక్ట్రిక్ కారు విదేశాల్లోనే అమ్మకాలకు సిద్ధం అయ్యింది. దేశంలో విద్యుత్ వాహనాల వినియోగం క్రమంగా పెరుగుతోంది. ఈక్రమంలో ప్రధాని నరేంద్రమోదీ గుజరాత్‌లోని హన్సల్‌పుర్ మారుతీసుజుకీ మోటార్ ప్లాంట్‌లో రెండు కీలక ప్రాజెక్టులు ప్రారంభించారు. మారుతీ సుజుకీ తొలికారు ఇ-విటారా తో పాటు- హైబ్రిడ్ బ్యాటరీ ఎలక్ట్రోడ్స్ ఉత్పత్తి చేసే తొలి ప్లాంట్‌కు జెండా ఊపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్, జపాన్ రాయబారి కీచీ ఒనో పాల్గొన్నారు. భారత్ స్వావలంబన సాధించేందుకు చేస్తోన్న ప్రయత్నాలకు ఇది ప్రత్యేకమైన రోజు. ఇక్కడ ఉత్పత్తి కానున్న కార్లు 100 దేశాలకు ఎగుమతి కానున్నాయని ఈ కార్యక్రమానికి ముందు మోదీ ఎక్స్ వేదికగా స్పందించారు. ఇ-విటారా తొలికారు యూకేకు ఎగుమతి కానుంది. తొషిబా, డెన్సో, సుజుకీసంస్థల భాగస్వామ్యంతో ఆ ప్లాంట్‌లో హైబ్రిడ్ బ్యాటరీ ఎలక్ట్రోడ్స్ తయారుకానున్నాయి. దాంతో 80 శాతం బ్యాటరీ దేశీయంగా సిద్ధం కానుంది. ప్రముఖ కార్ల తయారీ కంపెనీ మారుతీ సుజుకీ తన తొలి విద్యుత్ కారు ఇ-విటారా జనవరిలో ఆవిష్కరించిన సంగతి తెలిసిందే. ఈ కారును 100కు పైగా దేశాలకు ఎగుమతి చేయాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది.

పేజి 2లో ▶

## వినాయక వ్రతం ఎప్పటిలోగా ఆచరించాలి?

## ఈ నవరాత్రులపై గ్రహణ ప్రభావమెంత?



ఊరూవాడా కొలువై ఉండ్రాళ్లు ఆరగించే బొజ్జ గణపయ్య.. మనలో ధైర్యాన్ని, స్ఫూర్తిని నింపి మనల్ని ఆశీర్వదించేందుకు మండపాల్లోకి విచ్చేస్తున్నాడు. దేశమంతా ఎంతో వైభవంగా నిర్వహించే పండుగ వినాయక చవితి ఆగస్టు 27న జరగనుంది. సిద్ధి, బుద్ధి ప్రదాత అయిన విఘ్నేశ్వరుడి వ్రతం బుధవారం రావడం చాలా విశేషం. ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట లోపు ఆచరించడం ఉత్తమం.

**నాయతి నాయయతీతి వ నాయకః విశేషేణ**

**నాయకః వినాయకః**

పూర్వ జన్మ పాప పుణ్యాలకు సరిపడే తీరులో మనల్ని నడిపించేవాడు గణాధిపతి. అలాంటి గణేశుడిని వినాయక చవితిరోజు ఒక్కరోజు పూజించినా సకల పాపాలు నశించి, విఘ్నాలు తొలగి శుభాలు కలుగుతాయి. భారతీయ సనాతన ధర్మంలో షోడశ కర్మలు (1. గర్భాదానంబీ 2. పుంసవనంబీ 3. సీమంతం -జననానంతర సంస్కారములు (పుట్టిన తరువాత)బీ 4. జాతకర్మబీ 5. నామకరణంబీ 6. నిష్క్రమణబీ 7. అన్నప్రాశనబీ 8.చూడాకరణబీ 9. కర్ణవేదబీ 10. అక్షరాభ్యాసంబీ 11. ఉపనయనంబీ 12. వేదారంభంబీ 13. కేశాంతబీ 14. సమావర్తనబీ 15. వివాహంబీ 16. అంత్యేష్టి) ఆచరించాలన్నాబీ శుభకార్యాలు, వ్రతాలు చేయాలన్నా విఘ్నేశ్వరుడి పూజలేకుండా ఆచరించరాదని శాస్త్రం చెబుతోంది.

పేజి 2లో ▶

## బంగాళాఖాతంలో బలపడనున్న అల్పపీడనం

### తెలుగు రాష్ట్రాలకు వర్ష హెచ్చరికలు



2లో

## బీహార్‌లో రాహుల్ ఓటర్ అధికార యాత్ర

### పాల్గొన్న సిఎం రేవంత్, డిప్యూటి భట్టి, మంత్రులు



పాట్నా, : బీహార్ లో ఓటర్ అధికార యాత్ర తిరిగి ప్రారంభమైంది. మంగళవారం బీహార్ లోని సుపాల్ లో సాగుతున్న ఓటర్ అధికార్ యాత్రలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీతో కలిసి ప్రియాంకగాంధీ, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ- సీఎం మల్లు భట్టి విక్రమార్క సహా పలువురు మంత్రులు ఈ యాత్రలో పాల్గొన్నారు. ఆర్జేడీనేత తేజస్వి యాదవ్, ఇండియా బ్లాక్‌కు చెందిన ఇతర ప్రతినిధులతో పాటు నేతలంతా కారు పైకప్పుపై కూర్చుని ప్రజలకు అభివాదం చేశారు. ఒకరోజు విరామం తీసుకున్న వోట్ అధికార్ యాత్ర మంగళవారం తిరిగి ప్రారంభమైంది. ఆదివారం అరారియాలో జరిగిన విలేకరుల సమావేశంలో రాహుల్ గాంధీమాట్లాడుతూ..బీహార్‌లోని అన్ని భారత కూటమి నియోజకవర్గాలు రాబోయే అసెంబ్లీ ఎన్నికల కోసం ఐక్యంగా పనిచేస్తున్నాయన్నారు. మంచి ఫలితాలుంటాయని చెప్పారు. ప్రతిపక్ష కూటమిలోని అన్ని నియోజకవర్గాలు ఐక్యంగా పనిచేస్తున్నాయి. మేం కలుపుకుపోతున్నామన్నారు. సైద్ధాంతికంగా,రాజకీయంగా పరస్పరం ఒకరినొకరు గౌరవించుకుంటూ పోతున్నామన్నారు. బీహార్ ఎన్నికల సందర్భంగా ఇండియా కూటమి త్వరలో మేనిఫెస్టోను విడుదల చేస్తుందని రాహుల్ గాంధీ అన్నారు.




## భాజపా నేతకు కానుకగా ఫుట్‌బాల్.. ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి వినూత్న నిరసన



మిగతాది 2లో

## దొంగ ఓట్లంటూ కాంగ్రెస్ దుష్ప్రచారం.. ప్రజల్ని అవమానించడమే: బండి సంజయ్



మిగతాది 2లో

## ఫోక్సో కేసులో నల్లగొండ కోర్టు సంచలన తీర్పు

### హత్యాచార నిందితుడికి 51 ఏళ్ల జైలుశిక్ష



బాలికపై అత్యాచారం కేసులో నల్గొండ పోక్సో కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. నిందితుడికి 51 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ కోర్టు ఇన్‌ఛార్జి జడ్జి రోజారమణి తీర్పు వెలువరించారు. బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడన్న ఆరోపణలపై 2021లో తిప్పర్తి పీఎస్‌లో మహ్మద్ ఖయ్యూమ్ అనే వ్యక్తిపై పోక్సో కేసు నమోదైంది. 2022 నుంచి జిల్లా కోర్టులో వాదనలు కొనసాగగా.. తాజాగా తీర్పు వెల్లడైంది. అంతేకాదు.. 85 వేలు జరిమానా విధిస్తూ బాధితురాలికి 7 లక్షల పరిహారం అందించాలని నల్గొండ జిల్లా కోర్టు ఆదేశించింది. నల్గొండ జిల్లా తిప్పర్తి మండలానికి చెందిన బాలికపై అత్యాచారం చేసిన కేసులో నిందితుడు ఖయ్యూంకి ఈ కఠిన కారాగార శిక్షను కోర్టు విధించింది. తిప్పర్తి గ్రామం, మండలానికి చెందిన నిందితుడు ఖయ్యూంను ఎస్సీ ఎస్టీ కోర్ట్ జడ్జి రోజా రమణి దోషిగా తేల్చారు.

వివరాలు 2 లో..

## రాజీనామా చేసి మళ్లీ ఎన్నికలకు వెళ్దామా

### మహేశ్ కుమార్ గౌడ్‌కి రఘునందన్ రావు సవాల్



హైదరాబాద్: తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ బాధ్యత మరిచి మాట్లాడుతున్నారని భాజపా ఎంపీ రఘునందన్‌రావు విమర్శించారు. మా పార్టీ ఎంపీలందరం రాజీనామా చేసి మళ్లీ ఎన్నికలకు వెళ్తాం.. దానికి మీరు కూడా సిద్ధమా అని సవాల్ విసిరారు. రాజీనామా చేసే దైర్యం ఉందా అని ప్రశ్నించారు. ఓటు చోరీపై పీసీసీ అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలపై రఘునందన్‌రావు ఘాటుగా స్పందించారు.

“పీసీసీ అధ్యక్షుడిగా ఏది పడితే అది మాట్లాడితే కుదరదు. ఓటు చోరీ చేస్తే దేశంలో ఉన్న అన్ని పార్లమెంట్ స్థానాల్లో మేమే గెలుస్తాం కదా.

వివరాలు 2 లో..

# సంపాదకీయం

## సుప్రీం సందిగ్ధత ఎన్నికలకు శాపం

ఎన్నికల కమిషన్ (ఈసీ ఇంతగా వివాదాస్పదమై పలచనైపోయిన సందర్భం ఇంతకుముందు ఎప్పుడూ లేదనుకుంటాను. ఒకవైపు ఎన్నికలు చేరువలో ఉన్న బిహార్‌లో ఉన్నట్టుండి ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో చేపట్టిన కార్యక్రమం అభాసుపాలవుతున్నది....ఎన్నికల కమిషన్ (ఈసీ) ఇంతగా వివాదాస్పదమై పలచనైపోయిన సందర్భం ఇంతకుముందు ఎప్పుడూ లేదనుకుంటాను. ఒకవైపు ఎన్నికలు చేరువలో ఉన్న బిహార్‌లో ఉన్నట్టుండి ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో చేపట్టిన కార్యక్రమం అభాసుపాలవుతున్నది. ఇంకొకవైపు ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ పరిశోధించి బయటపెట్టిన భారీ దొంగ ఓట్ల బండారం ప్రజాస్వామ్యానికి పెనుముప్పును సూచిస్తూ కమిషన్ తలదించుకోవలసిన పరిస్థితిని కలిగించింది. ఈ రెండు ఉదంతాల్లోనూ అది కేంద్ర పాలకుల చేతిలో కీలుబొమ్మగా మారిపోయింది.ఏ పార్టీ, లేదా ఏ శక్తి, వ్యక్తి ఒత్తిడికీ లొంగకుండా సర్వ స్వతంత్రంగా పని చేయడానికే ఈసీకి రాజ్యాంగ హోదా కల్పించారు. ఎన్నికల నిలువుటద్దంలో ప్రజల తీర్పును యథాతథంగా ప్రస్ఫుటింపజేయవలసిన గురుతర బాధ్యతను రాజ్యాంగ నిర్మాతలు దీనికి అప్పగించారు. అందుకు విరుద్ధంగా అది దూడూ బసవన్న అయిపోవడం ఎంతో ఆవేదన కలిగిస్తున్నది. శేషన్ హయాంలో మితిమించిన కాఠిన్యం, ఇప్పుడు శ్రుతిమించిన దాసోహం. ప్రజాస్వామ్యంలోని సున్నితత్వాన్ని హరించిన శేషన్‌ను భరించగలిగాం గాని, జ్ఞానేశ్ వెన్నెముకలేమి దుర్భరంగా ఉన్నదని ప్రజలు, విజ్ఞులు వాపోతున్నారు.రాజ్యాంగం 324 అధికరణ ఎన్నికల సంఘానికి ప్రాణం పోసింది. ఈ ఆర్టికల్ ప్రకారం పార్లమెంట్‌కు, రాష్ట్రాల శాసనసభలకు, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి పదవులకు నిష్పాక్షిక, నిర్భయ వాతావరణంలో ఎన్నికలు జరిపించడం ఎన్నికల కమిషన్ ప్రధాన బాధ్యత. ఇంకా ఆయా ఎన్నికలకు ఓటర్ల జాబితాలను సిద్ధం చేయడం, ఎన్నికల్లో పార్టీలకు ప్రవర్తనా నియమావళి (కోడ్) విడుదల చేయడం, అభ్యర్థుల ప్రచార ఖర్చుపై పరిమితి విధించడం, ఈవీఎంలు, వీవీ ప్యాట్‌ల వంటి ఆధునిక సాంకేతిక సాధనాలను ప్రవేశపెట్టడం, నోటా మాదిరి విధానాలను చేర్చి ప్రజాస్వామ్య నైశిత్యానికి పదునుపెట్టడం, అభ్యర్థుల క్రిమినల్ నేపథ్యాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవడం ఎన్నికల కమిషన్‌కు గల ఇతర అధికారాలు.ఈ కమిషన్ 1950లో నెలకొన్నది. 1989లో ఓటింగ్ కనీస వయసును 21ఏళ్లకు బదులు 18 సంవత్సరాలు చేశారు. అప్పుడు తొలిసారిగా ఏకసభ్య కమిషన్ ముగ్గురు సభ్యుల వ్యవస్థగా మారింది. ఎన్నికల కమిషనర్లకు సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు ఉండే జీతభత్యాలు, సర్వీస్ నిబంధనలు వర్తిస్తాయి. ఎన్నికల నిష్పాక్షికతను కాపాడి ఓటు పవిత్రతకు భంగం వాటిల్లకుండా చూడవలసిన అవసరాన్ని గుర్తించి ఎన్నికల సంఘాన్ని ఇంతటి ఉన్నత స్థానంలో ఉంచారు. ఇప్పుడు అందుకు విరుద్ధమైన పరిస్థితులు తలెత్తడం ఆందోళనకరం. ఎన్నికల కమిషన్ ఎంత నిష్పక్షపాతంగా ఉండాలో సుప్రీంకోర్టు అనేకసార్లు విశదీకరించింది. ఇంత ప్రాధాన్యం కలిగిన ఎన్నికల కమిషన్‌కు కమిషనర్లను నియమించే ప్రక్రియ చాలా కాలం పాటు కేంద్ర ప్రభుత్వం గుప్పెట్లో ఉంది. దానికి స్వస్తి చెప్పేందుకు సుప్రీంకోర్టు సాగించిన ప్రశంసాపాత్రమైన కృషి విఫలమై తిరిగి కేంద్రం గుత్తాధిపత్యానికే దారితీసింది. ఇదే ప్రస్తుత చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్‌ను ఏరికోరి నియమించుకునే అధికారాన్ని మోదీ ప్రభుత్వానికి ఇచ్చింది.ఎన్నికల కమిషనర్లుగా సీనియర్ ఐఏఎస్‌లను, కేంద్ర కేబినెట్ సెక్రటరీలుగా పనిచేసిన వారిని, ఆ స్థాయి ఇతరులను నియమించేవారు. అందుబాటులోని ఇటువంటివారిలో తమకు ఇష్టులైన వ్యక్తులను సీఈసీలుగా, ఈసీలుగా ప్రధానమంత్రులు సిఫారసు చేయడం, వారిని రాష్ట్రపతి నియమించడం ఆనవాయితీగా చాలాకాలం పాటు కొనసాగింది. అయితే ఈ విధానాన్ని సవాలు చేస్తూ 2015లో రిటైర్డ్ ఐఏఎస్ అనూప్ బరన్వాల్ దాఖలు చేసిన జనహిత వ్యాజ్యం ఈ వ్యవహారాన్ని కీలకమైన మలుపు తిప్పింది. ఎన్నికల కమిషనర్ల నియామక ప్రక్రియ, ఎవరి జోక్యానికీ అతీతంగా, పారదర్శకంగా ఉండేలా చూడాలని ఈ పిటిషన్‌లో కోరారు. అప్పటికున్న నియామక విధానం ఎన్నికల స్వచ్ఛతను, నిష్పాక్షికతను హరిస్తున్నదని పిటిషనర్ వాదించారు. వాస్తవానికి ఎలక్షన్ కమిషనర్ల నియామకానికి అనుసరించవలసిన పద్ధతిని నిర్దేశిస్తూ పార్లమెంటు ప్రత్యేక చట్టాన్ని చేయాలని రాజ్యాంగం 342(2) 53(3)(బి)లు సూచిస్తున్నాయి. అటువంటి చట్టం లేకపోవడాన్ని ఆసరా చేసుకుని కేంద్ర పాలకులు ఇంతటి ముఖ్యమైన విషయంలో నిరంకుశంగా వ్యవహరిస్తూ వచ్చారు. ఈ కేసును విచారణకు స్వీకరించిన జస్టిస్ కేఎం జోసెఫ్ ఆధ్వర్యంలోని ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం 2023లో తీర్పు ఇచ్చింది. ఎన్నికల కమిషనర్ల నియామకానికి తగినవారిని రాష్ట్రపతికి సిఫారసు చేయడానికి ప్రధాని, ప్రతిపక్ష నేత, భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)తో ఒక కమిటీని వేయాలని స్పష్టం చేసింది. పార్లమెంటు ఒక చట్టం చేసేవరకు ఈ కమిటీ కొనసాగాలని చెప్పింది.స్వేచ్ఛతో కూడిన, స్వచ్ఛమైన ఎన్నికలకు నిష్పాక్షిక సీఈసీ అత్యంత అవసరమన్న ధర్మాసనం సందేశానికి విరుద్ధంగా కేంద్రం అతి తెలివిని ప్రదర్శించింది. కమిషనర్లుగా నియామకానికి తగినవారిని సిఫార్సు చేసే కమిటీ నుంచి సీజేఐని తొలగిస్తూ పార్లమెంటు చేత చట్టం చేయించింది. ఈ చట్టం ప్రకారం ప్రధాని, ఒక కేంద్రమంత్రి, ప్రతిపక్ష నేతతో కూడిన కమిటీ ఎన్నికల కమిషనర్ల నియామకానికి పేర్లను సిఫారసు చేస్తుంది. ఆ విధంగా కేంద్ర పాలకులు ఎన్నికల కమిషనర్ల నియామక ప్రక్రియలో తమ నిరంకుశ నిర్ణయానికి దారి చేసుకున్నారు. ఈ చట్టాన్ని నిలుపుదల చేయాలని కోరుతూ మధ్యప్రదేశ్ మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జయా ఠాకూర్ 2024 జనవరిలో సుప్రీంకోర్టులో దావా దాఖలు చేశారు. ఆ తర్వాత 'అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫామ్స్' దీనిని (ఏడిఆర్) సవాలు చేసింది. న్యాయమూర్తులు సంజీవ్ ఖన్నా, దీపాంకర్ దత్తాల ధర్మాసనం ఈ పిటిషన్లను విచారణకు స్వీకరించింది. కానీ కేంద్ర చట్టంపై స్టే ఇవ్వడానికి నిరాకరించింది.పార్లమెంట్‌కు, న్యాయవ్యవస్థకు పోటీ సృష్టించిన ఈ కేసులో చొరవ చూపడానికి సుప్రీంకోర్టు వెనుకాడుతున్నదని, దానివల్ల ఎన్నికలు కేంద్ర పాలకుల చేతిలో మైనపు ముద్దలా తయారై ప్రజాస్వామ్య ధర్మానికి తీవ్ర విఘాతం కలుగుతున్నదని భావించక తప్పడం లేదు. ఇంత పెద్ద దేశంలో ఎన్నికల వ్యవస్థ పాలకుల పంజరంలో చిలుక కావడం దారుణం. దీని ఫలితమే ప్రస్తుత సీఈసీ నిర్వాకం. 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు ఎన్నికల కమిషనర్ అరుణ్ గోయల్ రాజీనామా చేశారు. మరో కమిషనర్ సతీశ్‌చంద్ర పాండే అప్పటికే రిటైర్ అయ్యారు. కేంద్రం ఈ సందును ఉపయోగించుకుని జ్ఞానేశ్ కుమార్‌ను, సుఖ్‌వీర్‌సింగ్‌ను ఎన్నికల కమిషనర్లుగా నియమింపజేసింది. ఆ తర్వాత జ్ఞానేశ్‌ను ప్రధాన ఎన్నికల కమిషనర్ చేశారు. ఇంతలోగా జస్టిస్ ఖన్నా విచారణ బాధ్యతల నుంచి తప్పుకోవడం, కేసు మరో ధర్మాసనానికి వెళ్లడం జరిగిపోయాయి. దీనితో ఈ కేసు ఇప్పటికీ ఒక కొలిక్కి రాకుండా, ఎన్నికల కమిషనర్ల నియామక కమిటీ కేంద్రం నిరంకుశాధిపత్యంలోనే కొనసాగుతున్నది.సీఈసీగా జ్ఞానేశ్ కుమార్ తదుపరి సార్వత్రిక ఎన్నికలకు తెరలేవడానికి ముందు వరకు కొనసాగుతారు. ఎన్నికల కమిషనర్లకు సమాన హోదా లేదు, ముగ్గురినీ రాష్ట్రపతే నియమిస్తున్నప్పటికీ సీఈసీని తొలగించడానికి సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు ఉద్వాసన చెప్పే పద్ధతినే అనుసరించవలసి వుండగా, ఎన్నికల కమిషనర్లను మాత్రం సీఈసీ సిఫార్సుల మేరకు తప్పించాల్సి ఉంటుంది. ఇది కమిషనర్లను సీఈసీ చెప్పుచేతల్లో ఉంచుతుంది. ఎన్నికల కమిషనర్ల నియామకానికి పార్లమెంట్ చేసిన చట్టంపై ఖన్నా ధర్మాసనం స్టే విధించి ఉన్నా, దానిని రద్దు చేసినా ఈ దుస్థితి తొలగి ఉండేది. ఉన్నత న్యాయమూర్తుల నియామకం విషయంలో ప్రభుత్వం పార్లమెంటు ద్వారా నెలకొల్పిన జాతీయ న్యాయ నియామక కమిషన్‌ను కొనగోటితో తొలగించి కొలీజియంను కాపాడుకున్న సుప్రీంకోర్టు ఎన్నికల కమిషనర్ల నియామక కమిటీలో సీజేఐని తిరిగి చేర్పించే విషయంలో ఇంతగా వెనుకాడడం దేశ ప్రజాస్వామ్యాన్ని కంపింపజేస్తున్నది. ఇప్పటికైనా అత్యున్నత న్యాయ స్థానం కర్తవ్య స్ఫృహతో ఈసీల నియామక నిరంకుశ చట్టాన్ని రద్దు చేసి ఎన్నికల సంఘాన్ని జోక్యానికి, చొరబాటుకు వీలులేని దుర్భేద్య వ్యవస్థగా చేస్తుందని ఎదురు చూద్దాం.

# వినాయక వ్రతం ఎప్పటిలోగా ఆచరించాలి?

మొదటిపేజీ తరువాయి

పాప పుణ్యాలను తొలగించి మోక్షాన్ని ఇప్పించే గణపయ్యను వినాయక చవితి రోజున పూజిస్తే సకల శుభాలు కలుగుతాయి.

**మట్టి విగ్రహాన్నే ఎందుకు పూజించాలి?**

చెరువులు, నదుల వద్ద ఉన్న మట్టితో విఘ్నేశ్వరుడిని చేసి ఆ ప్రతిమను పూజించాలంటోంది శాస్త్రం. ఈ సృష్టి మొత్తం ఒకే పదార్థం నుంచి ఏర్పడింది (ఏకమై పరమై) .. తిరిగి అదే పదార్థంలో లయమవుతుందనేది వేదమంత్రం చెప్పింది. ఏ మట్టి నుంచైతే విఘ్నేశ్వరుడు వినాయక రూపంలో ఆవిర్భవించి పూజలందుకున్నాడో, అదే మట్టిరూపం తిరిగి యథాస్థానంలో లయమవుతుంది. అనగా, ఈ సృష్టిలో ప్రతి ప్రాణీ ఏ భగవంతుడి వద్ద నుంచి వచ్చిందో తిరిగి అక్కడే లయం అవ్వాలి. ఈ మధ్యలో ధర్మ మార్గంలో నడుస్తూ భక్తి మార్గాన్ని పెంపొందించుకుంటూ జ్ఞానమార్గాన్ని వెతుక్కుంటూ మోక్షమార్గాన్ని సంపాదించి ఆ పరమాత్ముడిలో లయం కావాలనేటువంటి నిగూఢ రహస్యం ఈ వ్రతంలో దాగి ఉంది. అందువల్ల మట్టి విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో పూజించాలి.

**గ్రహణ ప్రభావం**

విఘ్నేశ్వరుడి వ్రతం అనంతరం గణేశ నవరాత్రులు ఆచరించడం శాస్త్రసమ్మతం. గణపయ్యకు పత్రి పూజ చేస్తూ ఆయా ప్రాంతాల్లో ఆచారాలను బట్టి 1, 3, 5, 7, 9, 11, 21 రోజుల పాటు పూజించడం ఆచారం. అయితే, శ్రీ విశ్వావసు నామ సంవత్సరంలో సెప్టెంబర్ 7న రాహుగ్రస్త చంద్ర గ్రహణం ఏర్పడనుండటంతో అంతకుముందే గణేశ్ నిమజ్జనం పూర్తి చేసుకోవడం ఉత్తమం.

**21 రకాల పత్రాలు ఇవే..**

విఘ్నేశ్వరుడికి అనేక రూపాలు ఉన్నాయి. పురాణాలు, ఆగమ శాస్త్రాల్లో గణపతికి 33 రూపాలు వర్ణించబడ్డాయి. ప్రతీ రూపానికీ ప్రత్యేక ఆరాధన, ఫలితాలను చెప్పారు. వినాయక చవితి రోజున సింహాసనంపై కూర్చొన్న నాలుగు లేదా ఆరు చేతులు కలిగిన గజముఖంతో ఉన్నటువంటి ముఖ్యంగా ఒక చేతిలో కుడుములు, మరో చేయి ఆశీర్వచనం ఇచ్చేలా ఉన్నటువంటి మట్టిగణపతిని పూజించడం శ్రేష్ఠం. వినాయక వ్రతంలో ఏకవింశతి పత్ర పూజ (21) ఎంతో ప్రాధాన్యమైనది. ఆ పత్రాలన్నీ ఔషధ గుణాలతో కూడినవి కావడంతో భాద్రపదమాసంలో ఇంట్లో పూజలు చేయడం ద్వారా అనారోగ్య సమస్యలు ఉండవని ఆయుర్వేద శాస్త్రం చెబుతోంది.

**నిష్ఠగా నిమజ్జనం**

వినాయక వ్రతం అనంతరం నిమజ్జనం ఎంతో కీలక ఘట్టం. విఘ్నేశ్వరుడిని ఎంత భక్తితో పూజిస్తామో, వినాయక నిమజ్జనాన్నీ అంతకంటే ఎక్కువ భక్తిశ్రద్ధలతో ఆచరించాలి. విఘ్నేశ్వరుడిని నిమజ్జనం చేసే రోజు ఉపవాసం ఆచరించాలి. విఘ్నేశ్వరుడి నిమజ్జనం సముద్రం/నదులు/తటాకములు/ఇంట్లో లోతైన పాత్రల్లో గానీ భక్తి శ్రద్ధలతో, ఎలాంటి ఆడంబరాలకు పోకుండా చేయాలి. విఘ్నేశ్వరుడిని నిమజ్జనం చేసేటప్పుడు కాళ్లకు చెప్పులు ధరించకూడదు. ఆరోగ్యం రీత్యా ఉపవాసం చేయలేనటువంటి వారు విఘ్నేశ్వరుడికి సమర్పించిన లేదా నివేదించిన ప్రసాదాలను మాత్రమే స్వీకరించాలి. నిష్ఠగా వినాయక వ్రతాన్ని ఆచరించిన వారికి స్వామివారి అనుగ్రహం లభిస్తుంది. వినాయక వ్రతాన్ని ఆచరించేటప్పుడు గణపతి కథలను వింటూ అక్షింతలను దగ్గర పెట్టుకోవాలి. వ్రతం పూర్తయ్యాక వాటిని తలపై వేసుకోవాలి. మరీ ముఖ్యంగా వినాయక వ్రత కథలలో శమంతకోపాఖ్యానం కచ్చితంగా పఠించడం ద్వారా అపనిందలు తొలగి శు భాలు కలుగుతాయి.

## భాజపా నేతకు కానుకగా ఫుట్‌బాల్..
## ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి వినూత్న నిరసన

హైదరాబాద్: తెలంగాణలో భాజపా వ్యవహారంపై ఆ పార్టీ చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. భాజపా రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీకి కానుకగా ఫుట్‌బాల్ ఇచ్చి నిరసన తెలిపారు. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో పార్టీ వ్యవహారంపై విశ్వేశ్వర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీలో తనను ఫుట్‌బాల్ ఆడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రశేఖర్ తివారీని కలిస్తే.. రామచందర్ రావును కలవమంటున్నారు. రామచందర్‌రావును కలిస్తే.. అభయ్ పాటిల్‌ను కలవమంటున్నారు. ఒకరిని కలిస్తే మరొకరి పేరు చెబుతున్నారని మండిపడ్డారు. జిల్లా అధ్యక్షుల తీరు, పార్టీ కార్యక్రమాల్లో సమన్వయ లోపంపై తన అసంతృప్తిని వ్యక్తం చేశారు.

## రాజీనామా చేసి మళ్లీ ఎన్నికలకు వెళ్దామా

మొదటిపేజీ తరువాయి

మీరెందుకు 8 ఎంపీ స్థానాలు గెలుస్తారు?అసదుద్దీన్ ఎలా గెలుస్తారు. దమ్ముంటే మీ 8 మంది ఎంపీలతో రాజీనామా చేయించండి. మేమూ రాజీనామా చేస్తాం. కొత్త ఓటర్ లిస్ట్‌తో మళ్లీ ఎన్నికలకు వెళ్దాం. అప్పుడు వాస్తవాలు ఏంటో ప్రజలకు తెలుస్తాయి. భాజపాను అడిగి కామారెడ్డి డిక్లరేషన్ హామీ ఇచ్చారా? కుంటి సాకులు చెప్పకుండా బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి. కాళేశ్వరంపై నిజాయితీగా కమిషన్ నివేదికను రాష్ట్ర ప్రజల ముందు ఉంచాలి. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహణ లోపంతోనే యూరియా కొరత ఏర్పడింది. ఇతర రాష్ట్రాల్లో లేని యూరియా కొరత తెలంగాణలోనే ఎందుకు వచ్చింది?" అని రఘునందన్‌రావు ప్రశ్నించారు.

## భాగ్యనగరంలో ఉత్సవాలకు ప్రత్యేకత
## ఖైరతాబాద్ గణపతికి పెరుగుతున్న ఆదరణ

గణేశ్ ఉత్సవాల పేరెత్తగానే మహారాష్ట్ర తరవాత హైదరాబాదే గుర్తుకు వస్తుంది. హైదరాబాద్‌లో ఈ ఉత్సవాలకు అంతటి ఘనత ఉంది. భాగ్యనగర గణపతి నవరాత్రి ఉత్సవాలు నగర ప్రజల సామరస్య జీవనానికి, ఐకమత్యకు అద్దం పడతాయి. భాగ్యనగర గణపతి నవరాత్రి ఉత్సవాలు నగర ప్రజల సామరస్య జీవనానికి, ఐకమత్యకు అద్దం పడతాయి. ఖైరతాబాద్ వినాయకుడిని దర్శించుకునేందుకు ఏటా లక్షల్లో జనం తరలి వస్తారు. ఇక్కడ ఏటా ఓ రకమైన వినాయకుడి ప్రతిమను తయారు చేస్తున్నారు. మట్టి గణపతికి ప్రాధాన్యం పెరిగింది. బాలాపూర్ లడ్డూ వేలానికి ప్రతీక.ఇలా అనేక ప్రత్యేకతలు వినాయక ఉత్సవాల్లో ఉన్నాయి. నిమజ్జనం కూడా జంటనగరాల్లో బహుళ ప్రాచుర్యం పొందింది. హైదరాబాద్‌లోని కొన్ని వినాయక మండపాలలో లంబోదరుడి లడ్డూ ప్రసాదాన్ని కొందరు ముస్లిం, క్రిష్టియన్లూ వేలంపాట ద్వారా దక్కించుకోవడం అందుకు తార్కాణం. అంతేకాదు, చార్మినార్ తదితర ప్రాంతాలలో గణపతి శోభాయాత్ర సమయంలో కొందరు ముస్లింలు ఎదురెళ్లి భక్తులకు మంచినీరు అందించడం వంటి సేవా కార్యక్రమాలు చేపట్టిన సందర్భాలెన్నో. రాజా బహద్దుర్ వేంకటరామారెడ్డి హైదరాబాద్ కొత్వాల్‌గా బాధ్యతలు నిర్వర్తి స్తున్న సమయంలో గణపతి శోభాయాత్రలో చిన్నపాటి సమస్య తలెత్తింది. ఆ సమయంలో ఒక ఉన్నత పోలీసు అధికారిగా ఆయన అనుసరించిన వ్యూహం నేటి పోలీసులకూ ఆదర్శనీయం. గణపతి నిమజ్జనం సమయంలో కొందరు పోలీసులే భక్తులతో గొడవపెట్టు కున్నారు. దాంతో, ఊరేగింపు నడిరోడ్డుపై నిలిచింది. భక్తులు వినాయకుడి శోభాయాత్ర పల్లకిని నడిరోడ్డుపై దింపేశారు. ఆ సంగతి తెలిసి హుటాహుటిన సంఘట నా స్థలానికి చేరుకున్న కొత్వాల్, సమస్యకు కారణమైన పోలీసు జవానులను మందలించారు. అయినా భక్తులు వాదులాట ఆపలేదు. దాంతో వేంకటరామారెడ్డి స్వయంగా వినాయకుని ఊరేగింపు పల్లకిని భుజానికెత్తుకోబోయారు. అప్పుడుగానీ పరిస్థితి సద్దుమణగలేదు. నిమజ్జనం ప్రశాంతంగా సాగింది. ఆ సంఘటన తాలూకూ విషయాలు కొత్వాల్ వేంకటరామారెడ్డి జీవిత చరిత్ర ద్వారా తెలుస్తాయి. నగరంలో వినాయకచవితి జోష్ నెలకొంది. రోడ్ల నిండుగా విగ్రహాలు విక్రయానికి సిద్ధంగా ఉన్నాయి.

## ఎలక్ట్రిక్ వాహనరంగంలోకి మారుతి

మొదటిపేజీ తరువాయి

తద్వారా భారత్‌ను గ్లోబల్ ప్రొడక్షన్ హబ్‌గా తీర్చిదిద్దాలనుకుంటున్నట్లు సుజుకీ మోటార్ కార్పొరేషన్ ప్రెసిడెంట్ తొషిహిరో సుజుకీ అప్పుడు వెల్లడించారు. మారుతీ సుజుకీ ఇ-విటారా రెండు బ్యాటరీ ఆప్షన్లతో వస్తోంది. 49 కిలోవాట్ అవర్ బ్యాటరీతో వస్తున్న కారు 144 హెచ్‌పీ శక్తిని, 189 కప టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. 61÷ఔర బ్యాటరీ 174 బీహెచ్‌పీని 189 కప టార్క్‌ను విడుదల చేస్తుందని తెలుస్తోంది. అతిపెద్ద బ్యాటరీ వేరియంట్ 500 కిలోమీటర్లకు పైగా రేంజ్ ఇస్తుందని కంపెనీ ప్రదర్శించిన వీడియోలో పేర్కొంది. భారత్‌లో ఇ-విటారా తయారీకి రూ.2,100 కోట్లు- వెచ్చించినట్లు- మారుతీ సుజుకీ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ సీఈఓ హిసాషి టకేయుచి గతంలో తెలిపారు. మారుతీ సుజుకీ ఈవీలు కొనుగోలు చేసేవారికి స్మార్ట్ హోమ్ ఛార్జర్, ఇన్‌స్టలేషన్ సపోర్ట్‌ను అందించనున్నట్లు- తెలిపారు. తొలిదశలో 100 ప్రధాన నగరాల్లో ఫాస్ట్ ఛార్జింగ్ సదుపాయాలను అందించనున్నట్లు- వివరించారు. ప్రతి 5-10 కిలోమీటర్లకు మారుతీ సుజుకీ ఛార్జింగ్ పాయింట్లను అందుబాటు-లోకి తేనున్నట్లు- చెప్పారు.

## బంగాళాఖాతంలో బలపడనున్న అల్పపీడనం

మొదటిపేజీ తరువాయి

వాయువ్య బంగాళాఖాతంలో ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరాల వెంబడి అల్పపీడనం ఏర్పడిందని.. ఇది రాబోయే రెండు రోజుల్లో పశ్చిమ వాయువ్య దిశగా కదిలి మరింత బలపడే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు తెలిపారు. దీని ప్రభావంతో రాష్ట్రంలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు (ఐ।శా శ) కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు సూచించారు. మరోవైపు.. తెలంగాణ రాష్ట్రంలో రాగల మూడు రోజుల పాటు- భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. సోమవారం వాయువ్య బంగాళాఖాతం, దాని పరిసరాల్లో ఒడిశా వెస్ట్ బెంగాల్ తీరాలకు సమీపంలో ఉపరితల ఆవర్తనం కొనసాగిందని.. దీని ప్రభావంతో మంగళవారం ఉదయం అదే ప్రాంతంలో ఒక అల్పపీడన ప్రాంతం ఏర్పడిందని హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. దీనికి అనుబంధంగా ఉన్న ఉపరితల చక్రవాత ఆవర్తనం సగటు- సముద్ర మట్టం నుంచి 7.6 కిలోమీటర్ల ఎత్తువరకు కొనసాగుతూ.. ఎత్తు పెరిగే కొద్ది నైరుతి దిక్కుకు వాలి ఉందని తెలిపారు. ఈ అల్పపీడనం రాగల రెండు రోజుల్లో వాయువ్యదిశలో కదిలి మరింత బలపడే అవకాశం ఉందని చెప్పుకొచ్చారు. రుతుపవన ద్రోణి ఈరోజు గంగానగర్, శిరసా, ఆగ్రా, బండ, సిద్ధి, సంబల్పూర్, వాయువ్య బంగాళాఖాతం ప్రాంతంలో ఉన్న అల్పపీడన ప్రాంతం కేంద్రం, ఆ తర్వాత తూర్పు ఆగ్నేయ దిశలో తూర్పు, మధ్య బంగాళాఖాతం వరకు సగటు- సముద్రం మట్టం నుంచి 1.5 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతోందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు చాలా చోట్ల కురిసే అవకాశం ఉందని తెలిపారు. రేపు(బుధవారం), ఎల్లుండి(గురువారం) రాష్ట్రంలోని చాలా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని హెదైరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని వివరించారు. రేపు, ఎల్లుండి రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని చెప్పుకొచ్చారు. ఈరోజు, రేపు, ఎల్లుండి రాష్ట్రంలోని చాలా జిల్లాల్లో ఉరుములు, మెరుపులు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని హెదైరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు పేర్కొన్నారు.

## దొంగ ఓట్లంటూ కాంగ్రెస్ దుష్ప్రచారం..
## ప్రజల్ని అవమానించడమే: బండి సంజయ్

మొదటిపేజీ తరువాయి

కరీంనగర్: ఓట్ల చోరీ అంటూ కాంగ్రెస్ నేతలు చేస్తున్న ఆరోపణలు అర్థరహితమని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. 30 ఏళ్లుగా తాను ప్రజాప్రతినిధిగా ఉన్నానని చెప్పారు. వార్డు మెంబర్ కానివాళ్లు కూడా విమర్శించడం సరికాదన్నారు. ఇటీవల టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ చేసిన ఆరోపణల నేపథ్యంలో బండి సంజయ్ స్పందించారు. కరీంనగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు.

"దొంగ ఓట్లు అంటూ కాంగ్రెస్ నేతలు చేసే దుష్ప్రచారం ప్రజలను అవమానించడమే. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంచాయతీలకు ఒక్క పైసా అయినా ఇచ్చిందా? కేంద్రం నిధులు ఇస్తుందనే ఇప్పుడు స్థానిక ఎన్నికలు నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ నేతలు రాత్రిపూట యాత్రలు చేయడం ఏమిటో అర్థం కావడం లేదు. కరీంనగర్‌లో ప్రతి ఓటూ పరిశీలించి దొంగ ఓట్ల తీసేయాలి. రెండు చోట్ల ఓటు వేయడం ఎవరికైనా సాధ్యమా?అవగాహన లేకుండా ఇష్టారీతిన మాట్లాడుతున్నారు. పీసీసీ అధ్యక్షుడు ఓట్ల చోరీ గురించి కాకుండా సీట్ల చోరీ గురించి మాట్లాడాలి. రొహింగ్యాల విషయంలో ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నారు. దేశం ముఖ్యమా? ఓటు బ్యాంకు ముఖ్యమా?అప్పుడు భారత రాష్ట్ర సమితి.. ఇప్పుడు కాంగ్రెస్.. రెండూ అదే తరహా రాజకీయాలు చేస్తున్నాయి" అని బండి సంజయ్ విమర్శించారు.

## ఫోక్సో కేసులో నల్లగొండ కోర్టు సంచలన తీర్పు

మొదటిపేజీ తరువాయి

నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు నల్లగొండ డీఎస్పీ శివరాం రెడ్డి ఆధ్వర్యంలో బలమైన సాక్ష్యాధారాలను తిప్పర్తి ఎస్ఐ శంకర్ దాఖలు చేశారు. జడ్జి రోజా రమణి ఈ తరహా తీర్పును వెలువరించడం ఈ నెలలో ఇది రెండోసారి. బాలికను అత్యాచారం చంపేసిన వ్యక్తికి నల్గొండ పోక్సో కోర్టు ఉరి శిక్ష విధిస్తూ సంచలన తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. 2013లో ఈ ఘటన జరిగింది. నల్గొండ హైదర్ఖాన్ గూడలోని ఓ ఇంట్లో ఒంటరిగా ఉన్న 11 ఏండ్ల బాలికపై మాన్యం చెల్కకు చెందిన మహ్మద్ ముక్రం అత్యాచారం చేశాడు. రేప్ చేసిన విషయం ఎక్కడ బయటపడుతుందో అన్న భయంతో బాలిక మెడకు చున్నీ బిగించి హత్య చేశాడు. తర్వాత డెడ్ బాడీని డ్రైనేజీలో పడేశాడు. ఈ ఘటన 2013, ఏప్రిల్ 28న జరిగింది. బాలిక కనిపించకపోవడంతో పేరెంట్స్ నల్గొండ వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశాక విచారించిన పోలీసులు.. 2015లో చార్జిషీట్ దాఖలు చేశారు.పదేండ్ల పాటు- సుదీర్ఘ వాదనలు, వాయిదాలు కొనసాగాయి. నిందితుడు ముక్రంను పోక్సో కోర్టు దోషిగా తేల్చింది. దీంతో నిందితుడు ముక్రంకు ఉరిశిక్ష విధిస్తూ పోక్సో కోర్టు ఇన్ ఛార్జి జడ్జి జస్టిస్ రోజా రమణి తీర్పు వెలువరించారు. దీంతో పాటు- రూ.1.10 లక్షల జరిమానా విధించారు. బాలిక ఫ్యామిలీకి రూ.10 లక్షలు పరిహారం అందించాలని తీర్పులో పేర్కొన్నారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
బుధవారం ఆగస్ట్ 27 2025

## అనుమానస్పద స్థితిలో యువకుడు మృతి



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
మేడ్చల్ జిల్లా పోచారం ఐటి కారిడార్ పరిధిలోని ఇన్ఫోసిస్ ప్రాంతంలోని ఏఎస్బీఎల్ సైట్ ఆఫీస్ లేబర్ క్యాంప్ లో జెట్ లోహర్ (18) అనే యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన లోహర్ మృతిపై పోలీసులు హత్య కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్ టీమ్ తో కలిసి సంఘటనా స్థలంలో ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు, మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ఐకమత్యంతో ప్రశంసలు అందుకుంటోన్న ఆ గ్రామం



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
యాలాల మండలంలోని అన్న సాగర్ గ్రామంలో 40 ఏళ్లుగా గ్రామస్తులంతా కలిసి ఒకే వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించి, ఐక్యతను చాటుకుంటున్నారు. దాదాపు 200 కుటుంబాలు, 650 ఓటర్లు ఉన్న ఈ గ్రామంలో ఎస్సీ, బీసీ, ఓసీ కులాల వారు అందరూ కలిసిమెలిసి పండుగలను జరుపుకుంటారు. వినాయక చవితిని కూడా ఘనంగా నిర్వహిస్తారు. గ్రామస్తులందరూ కలిసి ఆంజనేయస్వామి దేవాలయం వద్ద చర్చించుకుని ఒకే విగ్రహాన్ని ప్రతిష్ఠించి, ఐదు రోజుల పాటు పూజలు నిర్వహించి, అనంతరం నిమజ్జనం చేస్తారు. ఈ సంప్రదాయం పలు గ్రామస్తుల ప్రశంసలు అందుకుంటోంది.

## లయన్స్ క్లబ్ అద్వర్యం లో మట్టి విగ్రహల పంపిణీ




మట్టి విగ్రహలు పంపిణీ చేస్తున్న దృశ్యం

**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెటుపల్లి**
జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండలం లోని వర్షకోండ గ్రామంలోని మండల పరిషత్ ఉన్నత పాఠశాల లో మెట్ పల్లి లయన్స్ క్లబ్ అధ్వర్యం లో మంగళవారం పర్యావరణ హితం కొరకు మట్టి వినాయకులనే పూజించాలి అనే ఉద్దేశ్యం తో 100 మట్టి వినాయకులను విద్యార్థులకు పంపిణి చేశారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ వర ప్రసాద్ ,మాజి ఎంపీటీసీ పోనుకంటి వెంకట్ ,లయన్స్ క్లబ్ మెట్ పల్లి అధ్యకులు వెల్ముల శ్రీనివాస్ రావు , మాజీ ప్రెసిడెంట్ ఇల్లందుల శ్రీనివాస్ , జనరల్ సెక్రటరీ మ్రి భాస్కర్ , పాఠశాల ప్రధానోపాధ్యాయులు అచ్చ విజయ భాస్కర్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మండల పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ

**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెటుపల్లి**




జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం వర్షకోండ గ్రామంలోని మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మహిళా మండల విఓఎస్ సభ్యులు ప్రహ్లాద లక్ష్మి, ఎస్ కె అప్సర, ఎస్ కె రుక్సానా విద్యార్థులకు మధ్యాహ్న భోజన సమయంలో 100 ప్లేట్లను, 10 వేల రూపాయల విలువైన వాటిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వర ప్రసాద్, మాజీ ఎంపీటీసీ పోనుకంటి వెంకట్, లయన్స్ క్లబ్ మెట్ పల్లి అధ్యక్షుడు వెల్ముల శ్రీనివాస్ రావు, మాజీ ప్రెసిడెంట్ ఇల్లేందుల శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ మ్రి భాస్కర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## మట్టి వినాయక విగ్రహాలను పూజించాలి



**కొండబత్తిని అమర్ నాథ్, కరపత్రం కోరుట్ల**
కోరుట్ల మండల అయిలాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు మట్టితో వినాయకుడిని తయారు చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు నరసింహమూర్తి మాట్లాడుతూ రసాయనాలతో కూడిన ప్లాస్టర్ గణపతులకు బదులుగా మట్టి విగ్రహాలను పూజించడం వల్ల నీటి కాలుష్యం జరగకుండా, చేపలు, ఇతర జలచరాలకు హాని కలగకుండా పర్యావరణాన్ని కాపాడవచ్చని మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సిరికొండ శ్రీరాం యూత్ అధ్యక్షుని నియామకం



**కొండబత్తిని అమర్ నాథ్, కరపత్రం కోరుట్ల**
కథలాపూర్ మండలం సిరికొండలో శ్రీరాం యూత్ అధ్యక్షుడిగా ముంజ మహేష్ వీరేంద్రను మంగళవారం నియమించారు. ఉపాధ్యక్షుడిగా నునుగొండ పునీత్, ప్రధాన కార్యదర్శిగా బెజ్జరపు నితిన్, కోశాధికారిగా మ్రిపెల్లి వంశీ ఎన్నికయ్యారు. తన నియామకానికి సహకరించిన సభ్యులకు మహేష్ వీరేంద్ర కృతజ్ఞతలు తెలిపారు. యూత్ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు చేపడతామని, వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మహేష్ వీరేంద్రను అభినందించారు.

## ప్రధానమంత్రి జనయోజన బీమా నామినీకి చెక్కు అందజేత



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**
జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఖాతాదారు పొడేటి సుదర్శన్ మృతిచెందగా, నామినీ అయిన భార్య అనూషకు రూ.2 లక్షల చెక్కును మేనేజర్ గోపికృష్ణ మంగళవారం అందజేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 9 మంది కుటుంబాలకు ప్రధానమంత్రి జనయోజన బీమా పథకం కింద ఒక్కొక్కరికి రూ.2 లక్షల చెక్కులు ఇచ్చామని, బ్యాంకు ఖాతాదారులందరూ ఈ పథకంలో తప్పనిసరిగా చేరాలని మేనేజర్ కోరారు.

## మూత్ర విసర్జకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని పోతాయిపల్లిలో విషాదకర సంఘటన చోటుచేసుకుంది. తూంకుంట మున్సిపాలిటీకి చెందిన హరిబాబు (28) అనే కూలీ, పోతాయిపల్లికి వెళ్తుండగా రోడ్డు పక్కన ఉన్న చెరువు వద్ద మూత్ర విసర్జన కోసం ఆపి, ప్రమాదవశాత్తు అందులో జారిపడి మృతి చెందాడు. స్థానికులు నీటిలో తేలియాడుతున్న హరిబాబును గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి, కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించారు.

## జర్నలిస్టుల దుస్థితిపై TWJF రాష్ట్ర అధ్యక్షుని ఆవేదన

**కొండబత్తిని అమర్ నాథ్, కరపత్రం ప్రతినిధి**



జగిత్యాల రూబీ ఫంక్షన్ హాలులో జరిగిన టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా సర్వసభ్య సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ జర్నలిస్టుల జీవన స్థితిగతులు దయనీయంగా మారాయని, ముఖ్యంగా మండలస్థాయి విలేకరుల పరిస్థితి అధ్వాన్నంగా ఉందని మంగళవారం ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం సమస్యలు పరిష్కరించక ద్రోహం చేసిందని, ఇప్పుడు కాంగ్రెస్ కూడా అదే మార్గంలో నడుస్తోందని విమర్శించారు. కొత్త అక్రెడిటేషన్, హెల్త్ కార్డులు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## వరదల్లో కొట్టుకుపోయి నలుగురు మృతి

**కరపత్రం ప్రతినిధి రాయపూర్,ఆగస్ట్26**
ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్ జిల్లాలో వరదల్లో కొట్టుకుపోయి నలుగురు మృతి చెందారు. మృతుల్లో ముగ్గురు చిన్నారులు, ఓ వ్యక్తి ఉన్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. దాదాపు 40 మందితో కూడిన ఓ కుటుంబం స్థానికంగా ఓ ఆలయ సందర్శనకు వచ్చింది. తిరుగు ప్రయాణంలో వారు నడుచుకుంటూ వాగు దాటుతుండగా.. భారీ వర్షం కురిసింది. వాగులో అకస్మాత్తుగా వరద ప్రవాహం పెరగడంతో అందులోని నలుగురు కొట్టుకుపోయారు. సహాయక చర్యలు చేపట్టిన అధికారులు.. వారి మృతదేహాలను వెలికితీశారు.

## లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా 320జి ఆధ్వర్యంలో మట్టి వినాయకుల పంపిణీ.



**కరపత్రం ప్రతినిధి ప్రతినిధి కరీంనగర్ ఆగస్టు 26**
పర్యావరణ హితంగా వినాయక చవితి జరుపుకోవాలని ప్రోత్సహించేందుకు భాగంగా 500 మట్టి వినాయక విగ్రహాలు కరీంనగర్ జ్యోతి నగర్, శ్రీనిధి చిట్స్ (హైదరాబాద్) ప్రైవేట్ లిమిటెడ్, ఓల్డ్ డిఐజి బిల్డింగ్ వద్ద పంపిణీ చేయబడినవి. ఈ సందర్భంగా లయన్ హన్మండ్ల రాజిరెడ్డి, ఐపీఎంసీసీ మాట్లాడుతూ మట్టి వినాయక విగ్రహాల ప్రయోజనాలను వివరించి, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు వల్ల కలిగే నష్టాలను ముఖ్యంగా నీటి కాలుష్యం , పర్యావరణ సమస్యలు గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న లయన్ నాయకులు
- లయన్ ఎస్. వాసుదేవ రెడ్డి, డి సి ఎస్,
- లయన్ డా. ఎం.ఎల్.ఎన్. రెడ్డి, జిల్లా అడ్మినిస్ట్రేటర్
- రాధాకృష్ణ రెడ్డి విహెచ్పి గో రక్షక్ రాష్ట్ర సమన్వయకర్,

లయన్ ఎం.వి. రామణా రెడ్డి లయన్ ఈ. రమేష్, జిల్లా జి ఎల్ టి కోఆర్డినేటర్,లయన్ బి. సారల, జిల్లా ఎఫ్ డబ్ల్యూ సి,కోఆర్డినేటర్,లయన్ వి. సంపతి కుమార్ ఆర్ సి,లయన్ బి. మల్లా రెడ్డి, జెడ్ సిక్లబ్ అధ్యక్షులు , సభ్యులుఎ. రవీందర్ రెడ్డి,పి. కిరణ్ కుమార్,జి. కుమార్ రెడ్డి,ఆర్. రాజు,తో పాటు అనేక మంది సభ్యులు పాల్గొన్నారు.

## టిబిజికేఎస్ కోశాధికారిగా చెల్పూరి సతీష్



**కరపత్రం ప్రతినిధి ప్రతినిధి గోదావరిఖని ఆగస్టు 26:**
తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం కోశాధికారిగా చెల్పూరి సతీష్ ను టిబిజికేఎస్ అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి నియమించారు. 20 సంవత్సరాలుగా బిఆర్ఎస్ పార్టీలో పనిచేస్తూ, విద్యార్థి నాయకునిగా, యూనియన్ లో క్రియాశీలకంగా పనిచేస్తున్న సతీష్ కోశాధికారిగా నియమించారు. తన నియమకానికి సహకరించిన గౌరవాధ్యక్షులు కొప్పుల ఈశ్వర్, అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి, కాపుకృష్ణ సురేందర్ రెడ్డి, మాదాసు రామ్మూర్తి, నూనె కొమరయ్య, పర్లపల్లి రవి, వడ్డేపల్లి శంకర్ కి సతీష్ కృతజ్ఞతలు తెలిపారు.

## ఉచిత మట్టి వినాయకుల పంపిణీ.

**కరపత్రం ప్రతినిధి ప్రతినిధి కరీంనగర్ ఆగస్టు 26**
వినాయక చవితి సందర్భంగా రాజరాజేశ్వరి లైన్స్ క్లబ్ , వినాయక నగర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విద్యానగర్ లో ప్లాస్టిక్ వాడడం తగ్గిద్దాం ,పర్యావరణం రక్షించుదామనే నినాదంతో ఉచిత మట్టి వినాయకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు నరహరి లక్ష్మారెడ్డి, సభ్యులు అప్పిడి విజయభాస్కర్ రెడ్డి, సంక్షేమ సంఘం కార్యదర్శి పెద్ది కొమురయ్య, సిహెచ్ నరోత్తం రెడ్డి ఖచ్చు మధు, పరంధాములు, బొంగోని పరుశరాములు, బండ రాకేష్ ,విద్యాసాగర్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇబ్రహీంపట్నంలో మండల స్థాయి ఉల్లాస్ శిక్షణ కార్యక్రమం





**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెటుపల్లి**
నవభారత సాక్షరతా కార్యక్రమం లో భాగంగా జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండల కేంద్రంలో ని రైతు వేదిక లో మండల స్థాయి ఉల్లాస్ శిక్షణ కార్యక్రమం ను సోమవారం మండల విద్యాధికారి బండారి మధు ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలంలోని ప్రతి గ్రామం నుండి ప్రభుత్వ ఉపాధ్యాయులు ఒకరు మరియు విఏఓ ఒకరు హాజరైయ్యారు. విద్యాధికారి మధు మాట్లాడుతూ అక్షరాస్యత ప్రాథమిక విద్య ప్రతి వ్యక్తి జీవితంలో అత్యంత కీలకమైనవి, ఇవి ఉంటేనే నేటి ఆధునిక సమాజంలో మనిషి మనుగడ సుఖంగా సాగుతుంది. ఎన్ ఎస్ పి 2020 ప్రకారం సంపూర్ణ అక్షరాస్యత సాధించడానికి ఉల్లాస్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. 200 గంటలు లేదా 3 నెలల కాలపరిమితితో వివిధ కారణాలవల్ల 15 సంవత్సరాలు ఆ పైబడిన చదువుకోని వయోజనులందరూ ఈ కార్యక్రమంలో అక్షరాస్యతతో పాటు కీలకమైన జీవన నైపుణ్యాలు నేర్చుకుంటారని చెప్పారు. గ్రామస్థాయిలో జరగబోయే ఉల్లాస్ కార్యక్రమంలో వాలంటీర్లకు శిక్షణ ఇచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం ఎ శంకర్, రిసోర్స్ పర్సన్స్ శివకుమార్, రఘునాథ్ మరియు ఎమ్మార్సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గీత కార్మికుల ఉపాధిని దెబ్బతీసే విధంగా నూతన మద్యం పాలసీ..

**- గౌడులకు రిజర్వేషన్ వల్ల గీత కార్మికులకు ప్రయోజనమేమీ లేదు**
**- జీవో నెంబర్ 93ను సవరించి కల్లుగీత సొసైటీలకే ఇవ్వాలి**
**- కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎన్.ఆశన్నగౌడ్**



**కరపత్రం ప్రతినిధి సంగారెడ్డి**
రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మద్యం పాలసీ లిక్కర్ కంపెనీలకు, బడా వ్యాపారులకు లాభం చేకూర్చి లక్షలాది మంది ఆధారపడి జీవిస్తున్న కల్లుగీత వృత్తిని దెబ్బతీస్తుందని సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఎన్.ఆశన్న గౌడ్, ప్రధాన కార్యదర్శి ఎస్ రమేష్ గౌడ్ లు అన్నారు. మంగళవారం సంగారెడ్డిలోని ప్రజాసంఘంల కార్యాలయంలో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ 15 శాతం గౌడ్ లకు రిజర్వేషన్ వల్ల కొంతమంది గౌడులకు ఉపయోగపడుతుంది తప్ప కల్లుగీత వృత్తి చేసే వాళ్లకి ఎలాంటి ప్రయోజనం ఉండదని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం వల్ల గీత కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని, కల్లుగీత కార్మిక సంఘం, గౌడ సంఘాలు ఆందోళన చేయగా మాజీ మంత్రివర్యులు శ్రీనివాస్ గౌడ్ చొరవతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం గౌడులకు 15 శాతం రిజర్వేషన్స్ ఇచ్చిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో గతంలో కంటే ఎక్కువ 25 శాతం ఇస్తామని చెప్పి ఎప్పటిలాగానే 15 శాతం ఇచ్చారని, అది కూడా గతంలో వలె గౌడులకే ఇస్తామంటున్నారు. ఏ ప్రయోజనం కోసం రిజర్వేషన్స్ ఇచ్చారో అది నెరవేరదు అన్నారు. అందుకని ప్రభుత్వం పునరాలోచించి జీవో నెంబర్ 93ను సవరించి ఇచ్చిన హామీ ప్రకారము 25 శాతం ఇవ్వాలి. అది కూడా కల్లుగీత సొసైటీలకే ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జంగన్న గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు అంజా గౌడ్, జిల్లా కార్యదర్శి ప్రసాద్ గౌడ్, జిల్లా కమిటీ సభ్యులు రామ గౌడ్, నాగరాజుగౌడ్, శ్రీనివాస్ గౌడ్, హరీష్ గౌడ్, కృష్ణ గౌడ్, ప్రతాప్ గౌడ్, శ్రీధర్ గౌడ్, రంగా గౌడ్, లక్ష్మణ్ గౌడ్, నరసింహ గౌడ్, వెంకటేష్ గౌడ్, శివరాం గౌడ్, యాద గౌడ్ ,రవి గౌడ్ కుమార్ గౌడ్, గంగా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# బాధితుల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

**- ప్రజల మన్ననలు పొందే లాగా జవాబుదారి తనంతో పని చేయాలి**
**- రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**



**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని ఆగస్టు 26:**
ప్రజల మన్ననలు పొందే లాగా జవాబుదారి తనంతో ప్రజలు, బాధితులు అందించే ఫిర్యాదులపై అధికారులు తక్షణమే స్పందించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పోలీస్ అధికారులకు సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా రామగుండం పోలీస్ కమిషనర్ మంగళవారం బసంత్ నగర్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. తనిఖీలకై పోలీస్ స్టేషన్ చేరుకున్న పోలీస్ కమిషనర్‌కు పోలీస్ అధికారులు పూలమొక్కలను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఈ తనిఖీల్లో భాగంగా సీపీ పోలీస్ స్టేషన్ రిసెప్షన్, సిసిటిఎన్ఎస్ విభాగాల పనీతీరును సంబంధిత పోలీస్ సిబ్బందిని సిపి అడిగి తెలుసుకున్నారు. రిసెప్షన్ సిబ్బందితో మాట్లాడి సిటిజన్ ఫీడ్ బ్యాక్ ఏవిదంగా ఉంది అని అడిగి తెలుసుకున్నారు. తనిఖీలలో భాగంగా పోలీస్ స్టేషన్ సంబంధించిన పలు రికార్డులను తనిఖీ చేయడంతో పాటు, పెండిరగ్ కేసులు, కోర్టు కేసులు, ప్రస్తుతం దర్యాప్తులో వున్న కేసులకు సంబంధించి పోలీస్ కమిషనర్ క్షుణ్ణంగా తనిఖీ చేసి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. అలాగే స్టేషన్ పరిధిలో రౌడీ షీటర్లు, అనుమానితులు, కేడీ, డిసిలు, మిస్సింగ్, ఆస్తి నేరాలకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించిన పోలీస్ కమిషనర్ సిబ్బందిని శాఖపరమైన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రజల నమ్మకాన్ని కలిగించడంతో పాటు, పోలీస్ వ్యవస్థ పట్ల ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించాలంటే ప్రతి పోలీస్ ఉద్యోగి నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వహించాలని, ప్రజల సమస్యలకు తక్షణ స్పందనతోపాటు, మర్యాదపూర్వకంగా వారి ఫిర్యాదులు ఆలకించాల్సిన బాధ్యత అందరిపై ఉందని సీపీ పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో పెద్దపల్లి డీసీపీ కరుణాకర్, పెద్దపల్లి సిఐ ప్రవీణ్ కుమార్, బసంత్ నగర్ ఎస్.ఐ స్వామి పాల్గొన్నారు.

# పిసిసి అధ్యక్షుడిపై బండి సంజయ్ చేసేవి ఆరోపణలే

**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**

**- సమాధానం చెప్పలేక పక్క దారి పట్టించడం బండికి వెన్నతో పెట్టిన విద్య**
**- మేము దిష్టి బొమ్మలు,ఫ్లెక్సీలు కాలబెట్టడం మొదలు పెడితే మీరు తట్టుకోలేరు**
**- కాంగ్రెస్ పార్టీ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకోం**
**- సుడా చైర్మన్ నగర కాంగ్రెస్ అధ్యక్షుడు,కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఫైర్**



పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా పక్కదారి పట్టిస్తున్న కేంద్ర హెూంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ చేస్తున్న ఆరోపణలన్నీ తొండి ఆరోపణలే అని సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. 42 శాతం రిజర్వేషన్ లో మైనారిటీలకు పది శాతం అని తప్పుడు ప్రచారం చేస్తున్నారని,ఓట్ చోరీ జరుగుతుందంటే ఓటు వేసిన అందరినీ అవమానపరచినట్లని తప్పుడు ప్రచారం చేస్తున్నారని దేవుళ్లపై వ్యాఖ్యలు చేయకున్నా చేసినట్టు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఈ విధంగా సమాధానం చెప్పలేక తప్పుడు ప్రచారం చేయడం పక్క దారి పట్టించడం బండి సంజయ్ కుమార్ కు వెన్నతో పెట్టిన విద్య అని నరేందర్ రెడ్డి ఆరోపించారు. ఒక బీసీ నాయకుడు 45 సంవత్సరాలుగా ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని నిబద్ధతతో కాంగ్రెస్ పార్టీలో పని చేస్తూ రాష్ట్ర అధ్యక్షుడైన మహేష్ కుమార్ గౌడ్ పై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని కాంగ్రెస్ పార్టీని బిచ్చగాళ్ల పార్టీ అని మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని దిష్టి బొమ్మలు ఫ్లెక్సీలు కాలపెట్టడం మేము మొదలు పెడుతే మీరు తట్టుకోలేరని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఇప్పటికైనా బండి సంజయ్ కుమార్ 42 శాతం రిజర్వేషన్,ఓట్ చోరి ఈ రెండు అంశాలపై ప్రజలకు మీ వైఖరి స్పష్టం చేయాలని నరేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో ఎండి తాజ్,జీడి రమేష్,పెద్దిగారి తిరుపతి,గుండాటి శ్రీనివాస్ రెడ్డి,అస్థాపురం రమేష్,శభాన మహమ్మద్, ఊరడి లత,యనమల మంజుల,కిరణ్ రెడ్డి,మాసుం ఖాన్,తోట అంజయ్య,కొట్టే ప్రభాకర్, మామిడి సత్యనారాయణ రెడ్డి,ఇమ్రాన్,హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# వినాయక చవితి శుభాకాంక్షలు.

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ ఆగస్టు 26**

**మొగిలి సతీష్ జిల్లా అధ్యక్షులు హ్యూమన్ రైట్స్**



ముక్కోటి దేవతల కన్నా ముందు మనము మహా వినాయకుని పూజిస్తాము. దేవుని అన్ని కార్యక్రమాలకు విఘ్నేశ్వరుని ముందు పూజిస్తారనీ , అలాంటి మహా గణపతి చవితి పండగ మనకు ముఖ్యమైన పండుగ అనీ,నవరాత్రులు మహా గణపతిని పూజిస్తూ, దైవాన్ని కొలుస్తూ నవరాత్రులు పూజలు చేస్తుండాలని, మట్టి గణపతి విగ్రహాలను నెలకొల్పుతూ ఇంటింటా మన ఇంట్లో మనము పెట్టుకునే గణపతి ఒక శ్రేష్టమైందనీ,అందుకే మనమందరం పర్యావరణ రక్షిస్తూ మట్టి విగ్రహాలను పూజిద్దాం అనీ , అందరూ ఆరోగ్యంగా అష్టైశ్వర్యాలతో ఉండాలని ఆ భగవంతుని కోరుకుంటున్నాను అని తెలిపారు.

# 5 ఇంక్లైన్ లోనే యూపీహెచ్సీ ఆసుపత్రి కొనసాగింపు



**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని ఆగస్టు 26:**
రామగుండం మున్సిపల్ కార్పోరేషన్ ఏరియా 33వ డివిజన్ పరిధిలోని పరశు రాంనగర్ లో 5 ఇంక్లైన్ యూపీహెచ్సీ ఆసుపత్రిలో వైద్యచికిత్సలు అందేలా డీఎంహెచ్ఓ ఉత్తర్వులు జారీ చేశారు. రామగుండం మున్సిపల్ కార్పోరేషన్ ఏరియా 33వ డివిజన్ పరిధిలోని పరశురాంనగర్, విఠల్నగర్, 5 ఇంక్లయిన్ ఏరియా నివాసులము. మా డివిజన్ లోని కొన్ని ఇండ్లను 11వ డివిజన్ లోని 5 ఇంక్లైన్ యూపీహెచ్సీ ఆసుపత్రికి, ఇంకొన్ని ఇండ్లను 14వ డివిజన్ లోని లక్మిపూర్ యూపీహెచ్సీ ఆసుపత్రికి కెటాయించారు. దీంతో గత 5 సంవత్సరాలు నుండి ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని కాలనీవాసులు డీఎంహెచ్ఓ వినతి పత్రం అందజేశారు. స్పందించిన డీఎంహెచ్ఓ 5 ఇంక్లైన్ లోనే యూపీహెచ్సీ ఆసుపత్రి కొనసాగించాలని ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# పారమిత విద్యాసంస్థలలో ఘనంగా వినాయక చవితి ఉత్సవాలు.



**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**
పారమిత విద్యాసంస్థలలో విద్యార్థులందరూ ఘనంగా వినాయక చవితి వేడుకలను జరుపుకున్నారు . విద్యార్థులు మట్టి గణపతిని ఆట పాటలతో ఊరేగింపు గా తీసుకువచ్చి ప్రతిష్టించి పూజలు చేసి మంచి విద్యాబుద్ధులు ప్రసాదించమని వేడుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు గణనాథుని స్మరించుకుంటూ నృత్య,గానాలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మట్టి గణపతి తయారీ పోటీలను నిర్వహించి బహుమతులను ప్రధానం చేశారు. మట్టి గణపతిని పూజించండి,పర్యావరణాన్ని కాపాడండి అంటూ విద్యార్థులు నినాదాలు చేసి మట్టి గణపతి ప్రాముఖ్యత ని గూర్చి అందరికీ వివరించారు. ఈ సందర్భంగా పారమిత పాఠశాల చైర్మన్ డాక్టర్ ఈ. ప్రసాద్ రావు విద్యార్థులకు, తల్లిదండ్రులకు , ఉపాధ్యాయులకు, కరీంనగర్ పట్టణ ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో డైరెక్టర్స్ ప్రసూన,అనూకర్ రావు, రశ్మిత, వినోద్ రావు,రమణ, వి.యు.యం. ప్రసాద్, హన్మంత రావు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బాలాజీ, ప్రశాంత్, కవిత, శ్రీకర్, శర్మిష్ఠ, గోపీకృష్ణ, సమన్వయ కర్తలు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# హమ్ ఆధ్వర్యంలో మట్టి గణపతుల పంపిణీ:

**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**



హామ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో యోగా చేస్తున్నటువంటి వారికి మట్టి గణపతులను ఉచితంగా పంపిణీ చేయడం జరిగిందని సంస్థ వ్యవస్థాపకులు ధనపురి సాగర్ తెలియజేశారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో తయారు చేసినటువంటి విగ్రహాలను నెలకొల్పి దాని నిమర్జనం చేసినప్పుడు కలిగే అనర్థాలను దృష్టిలో పెట్టుకొని మనందరం కూడా మట్టి గణపతిని పూజించాలని అని తెలిపారు. వినాయక చవితి పండుగను పురస్కరించుకొని సంస్థ పక్షాన 200 మట్టి గణపతులను పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు దనపురి సాగర్ ,కోశాధికారి తిరుపతి, సభ్యులు మనోజ్ కుమార్ ముందడ, ఇతరులు పాల్గొన్నారు.

# విశ్వశాంతి ప్రైమరీ స్కూల్ లో విద్యార్థుల ఎన్నికలు.




**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ ఆగస్టు 26**
విశ్వశాంతి పాఠశాల సప్తగిరికాలనీ కరీంనగర్ లో గల జరిగిన సార్వత్రిక ఎన్నికలలో భాగంగా వివిధ విభాగాలకు ఎన్నిక అయిన అభ్యర్థులకు కరస్పాండెంట్ , డైరెక్టర్లు ఆంజనేయులు , గిరిధర్ , రాజేశ్ సత్కరించారు. బాధ్యతలు హెడ్బాయ్ ఎం.డి అసిఫ్ ,హెడ్ గర్ల్స్ మనొరిత, డిప్యూటీహెడ్ బాయ్ అశుతోష్ రాణా, డిప్యూటీ గర్ల్ సమీక్ష, డిసిప్లెన్ సెక్రటరీ ప్రణిత్, మనస్విని. డిప్యూటీ డిసిప్లిక్ సెక్రటరీ' సాయిరిత్విక్, అఫిసిన్ కౌసర్, స్టార్స్, కల్చరల్ సుజిత్అవు, వర్ష డిప్యూటీ స్టోర్స్ కల్చరల్ సెక్రటరీలు జయంత్ క్రష్ణ. వాసుకి బాధ్యతలు అప్పగించి బ్యాడ్జలతో సగర్వంగా విద్యార్థులను సత్కరించారు.

# వాల్బాపూర్ లో వైద్య శిబిరాన్ని సందర్శించిన డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ చందు..



**కరపత్రం ప్రతినిధి వీణవంక, ఆగస్ట్ 26,**
వీణవంక మండల పరిధిలోని వాల్బాపూర్ గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మొత్తం 80 మంది ఔట్‌పేషెంట్స్ (ఒపీడీ) ను పరిశీలించగా, వారిలో 2 మందికి సాధారణ జ్వరం కేసులు గుర్తించారు. అవసరమైన నమూనాలు సేకరించి, లక్షణాలకు అనుగుణంగా చికిత్స అందించారు. సాధారణ తనిఖీ సందర్భంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డా. చందు,డా. ఉమశ్రీ వాల్బాపూర్‌లో జరుగుతున్న వైద్య శిబిరాన్ని సందర్శించారు. పీడీఎంఓ డా. రజినీకాంత్, ఏఎన్ఎమ్ మరియు ఆశల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో సరైన వైద్య పరీక్షలు, సీజనల్ వ్యాధుల నివారణ చర్యలపై సూచనలు అందించారు. అదేవిధంగా ఇంటింటి జ్వర సర్వేలో పాల్గొని, డ్రై ఫ్రైడే యాంటీ చర్యల నాణ్యతను కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ చందు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి ఉండాలని,సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రభుత్వం అందించే మందులనే వాడాలని, తద్వారా ఆర్థికంగా భారం తగ్గించుకోవచ్చు అని మాట్లాడారు. మలేరియా,డెంగ్యూ,చికెన్ గునియా మొదలగు వ్యాధులు వ్యాపించు విధానం తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు.